

డయల్ యువర్ డీఎంకు ఫిర్యాదుల వెల్లువ

కళ్యాణ్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని, పెద్దపల్లి పట్టణాల ఆర్టీసీ ప్రయాణికుల కోసం శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. చాలా మంది ప్రయాణికులు రద్దీగా ఉన్న రూట్లలో బస్సుల సంఖ్య పెంచాలని డీఎం నాగభూషణంను కోరారు. గోదావరిఖని, జమ్మికుంట, కరీంనగర్, మణుగూరు, మంథని రూట్ల మధ్య బస్సుల సంఖ్య పెంచి ఎక్కువ ట్రిప్పులు నడపాలని ప్రయాణికులు కోరారు. కరీంనగర్‌కు డిలక్స్ బస్సుల సౌకర్యం కల్పించాలని కోరగా స్పందించిన డీఎం కొత్త బస్సులు వచ్చిన తరువాత అధికారుల ఆదేశాల మేరకు బస్సు సంఖ్య పెంచుతామన్నారు.


సుల్తానాబాద్ వేణుగోపాల స్వామి ఆలయంలో దీపోత్సవం..


రాగినేడులో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


గోదావరిఖని కోదండ రామాలయంలో భక్తుల రద్దీ


కాలనీల ఒడి బియ్యం తీసుకవస్తున్న కందుల సంధ్యారాణి


మంథనిలో భక్తుల పూజలు..


మంథని గోదావరినది తీరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో దీపోత్సవం

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు.. - తులసి, ఉసిరి చెట్ల వద్ద ప్రత్యేక పూజలు - సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు - గోదావరి, మానేరు తీరంలో పుణ్య స్నానాలు

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలను శుక్రవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణల్లోని తులసి, ఉసిరి, రావి, తదితర వృక్షాల కింద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సాంబశివ దేవాలయంలో జ్వాలాతోరణం వెలిగించారు. ఇంటింటా సత్యనారాయణ స్వామి నోములు, వ్రతాలను నోచుకున్నారు. వేణుగోపాల స్వామి దేవాలయంలో దీపోత్సవం నిర్వహించారు. అలాగే సాంబశివ ఆలయాల అవరణల్లో పెద్దఎత్తున దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ సమతక్రిష్ణ, ఆలయ ఛైర్మన్ పల్లా మురళి తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలం రాగినేడు స్వయంభు శ్రీనాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వర కు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 54 పార్థివ లింగాలకు పూజలు, 20 జంటలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, గోమాత పూజ, రుద్రాభిషేకాలు, తులసి కల్యాణం, దీపోత్సహం నిర్వహించారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ పోతురాజుల భూమయ్య, పడాల తిరుపతి, దేశగిరిరావు, పడాల భూమయ్యపడాల సత్యనారాయణ, రఘుపతిరావు, శ్రీధర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.కాగా, నాగలింగేశ్వర ఆల యానికి వచ్చే భక్తులకు దాహార్తిని తీర్చేందుకు బ్రాహ్మణపల్లికి చెందిన మ్యాకల సరస్వతి-రాజేశం దంపతులు సుమారు 50వేల విలువగల వాటర్‌ప్లాంట్‌ను అందించారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు.

● కోల్‌సిటీటౌన్(ఆంధ్రజ్యోతి):గోదావరిఖనిలో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కోదండ రామాలయంలోని శివాలయంలో అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిగాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. సాయంత్రం జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించారు. అలాగే జనగామలోని శివాలయం, పవర్‌హౌస్‌కాలనీ, మార్కండేయకాలనీలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాణి రుద్రమదేవి సెంటర్ నుంచి 108 కిలోల ఓడి బియ్యం, 108 దీపాలతో ఆలయం వరకు మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా 108రకాల అభిషేకాలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, హనుమాన్, విశ్వకర్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సంతోషిమాత ఆలయంలో జరిగిన పూజల్లో బీజేపీ రామగుండం ఇంచార్జి కందుల సంధ్యారాణి పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం కార్తీక మాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇంటింటికి దీపాలు వెలిగించారు. కేదారేశ్వరస్వామికి నోముకున్నారు. మడిపెల్లి హుస్సేన్మియా వాగు ఒడ్డున ఉన్న శివలింగానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారిక ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో నిర్వహించిన సత్యనారాయణ సామూహిక వ్రతంలో 30 జంటలు, భక్త మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కాసర్ల సంజీవరెడ్డి, గోపు సురెందర్‌రెడ్డి, మల్లారెడ్డి, దేవందర్‌రెడ్డి, పొట్యాల రమేష్ పలువురు పాల్గొన్నారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి): మండలంలో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జునస్వామి, ఓదెలలో శివాలయం, గుంపులలో రామభద్రాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. శివాలయంలో ఆకాశ దీపాన్ని, మల్లన్న ఆలయంలో దీపోత్సవాలను నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండలంలో కార్తీకపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువ జామునే ఆలయాల్లో పూజలు, పవిత్ర స్నానాలను ఆచరించేందుకు తరలివెళ్లారు. రాత్రి సమయంలో ప్రతి ఇంటిలో దీపాలను వెలిగించి ప్రజలు తమ భక్తిని చాటుకున్నారు.

● మంథని (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. మంథని శివారులోని గోదావరినదిలో తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. వేద పండితులతో సంకల్పం చెప్పించుకొని వారికి ఉసిరికాయతోపాటు దీపాలు, ఇతర వస్తువులు దానంగా సమర్పించారు. అనంతరం నది తీరంలో గోదావరిమాతకు, సైకత లింగాలతో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమహాలక్ష్మి, శ్రీగౌతమేశ్వ ర, శ్రీలక్ష్మినారాయణ స్వామి, శ్రీగోపి జనవల్లభ ఆలయాల ప్రత్యేకపూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో, ఉసిరిక చెట్టు, ఇంటి వద్ద తులసి కోటకు, పూజగదుల్లో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరినది తీరంలోని శ్రీగౌతమేశర్వాయం ప్రాంగణంలో స్వామి-అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. గోదావరిమాతకు హారతి ఇచ్చారు. ఇండ్లలో శ్రీసత్యనారాయణస్వామి వత్రాలు నొముకున్నారు. మహిళా భక్తులు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఇంట్లో, ఆలయాల్లో సాయంత్రం నుంచి రాత్రి వరకు దీపాలు వెలిగించారు.

● ముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలో ఘనంగా శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మచ్చుపేట శివారులోని బగులగుట్టలో భక్తులు గురువారం నుంచి పుణ్యస్నానాలు ఆచరించి శుక్రవారం తెల్లవారుజామున పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయా ఇండ్లలో తులసి పూజలను నిర్వహించారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో సాయంత్రం దీపోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా కార్తీకపౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని ఆదివరహాస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఇళ్ల ముందు దీపాలతో సుందరంగా అలకరించారు. వాడవాడలా దీపాల కాంతులతో అధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ వనంరాంచందర్‌రావు ఆధ్వర్యంలో ఉసిరి వనంలో వ్రతాలకు దంపతులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

● పాలకుర్తి (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. మహిళలు తమ ఇళ్ల ముందు తులసిగద్దెల వద్ద దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని ఆలయాలలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. పుణ్యక్షేత్రమైన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. పలువురు సమీపంలోని గోదారిలో పుణ్య స్నానాలు చేసి గోదారితల్లికి పూజలు చేశారు. వేమునూర్‌లోని వెంకటేశ్వర ఆలయంలో స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు.


కమాన్‌పూర్‌లో..


బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఎలిగేడులో..


దేవునిపల్లిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్


గోదావరి హారతిని విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఏటా గోదావరి తీరంలో హారతి నిర్వహిస్తున్నట్టుగానే ఈనెల 18న మంథనిలో, 21న అంతర్గాంలో, 24న ధర్మపురంలోని, 27న గోదావరిఖని గోదావరి తీరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు గోదావరి హారతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ క్యాతం వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. 13సంవత్సరాలుగా జీవకోటికి ఆధారమైన నది జలాలను పూజించడం జరుగుతుందని, గంగమ్మ ఒడిలో దీపాలను వదిలి నదమ్మతల్లి ఆశీస్సులను పొందాలని కోరారు.

కౌండిన్య మహర్షి జయంతి

ఓదెల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో కౌండిన్య మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. గౌడ సంఘం అధ్యక్షుడు నాగపురి రవిగౌడ్ మాట్లాడుతూ, కార్తీక మాసం రోజున జన్మించిన కౌండిన్య మహర్షి గౌడ కులస్తులందరికీ ఆరాధ్యుడని తెలిపారు. అనంతరం మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ముంజాల మహేందర్, చింతల పరుశురాం, గట్టు అనిల్, నాగపురి పెద్ద రవి, శ్రీపతి మహేష్, కోట గిరి కొమరయ్య, ఐలు శ్రీనివాస్, భూసారపు అనిల్, మార్క చందు, అమడగోని కుమార్, పోతుగంటి వెంకటేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



- 455 మంది రైతుల ఖాతాల్లో జమ
- జిల్లాలో ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటివరకు 26,208.84 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు రైతుల ఖాతాల్లో గత నాలుగు రోజుల నుంచి ఆ సొమ్ము జమ అవుతుండడంతో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. బోనస్ డబ్బులు ప్రభుత్వం ఇస్తుందా, లేదా అనే సందేహాలు రైతుల్లో నెలకొనడంతో ఆందోళనకు గురయ్యారు. కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించిన తర్వాత ఆ వివరాలను పౌరసరఫరాల శాఖ అధికారులు తీసుకుని ప్రభుత్వానికి పంపిస్తారు. దీంతో కాస్త ఆలస్యం అవుతున్నది. చెల్లింపులు ప్రారంభం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 455 మంది రైతుల ఖాతాల్లో 36,240 క్వింటాళ్ల ధాన్యానికి సంబంధించి కోటి 81 లక్షల 15 వేల 600 రూపాయలు జిల్లా పౌర సరఫరాల శాఖాధికారులు జమ చేశారు. జిల్లాలో ఈ సీజన్‌లో 2,09,562 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, ఇందులో సన్న రకం 1,72,879 ఎకరాలు, 36,683 ఎకరాల్లో దొడ్డు రకం వరి పంటను సాగు చేశారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లాలో 327 కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం 318 కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పటి వరకు 3,893 మంది రైతుల నుంచి 60 కోట్ల 80 లక్షల రూపాయల విలువైన దొడ్డు రకం ధాన్యం 15,674.08 మెట్రిక్ టన్నులు, సన్న రకం ధాన్యం 10,534.76 మెట్రిక్ టన్నుల ధాన్యం, మొత్తం 26,208.84 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 1796 మంది రైతులకు 25 కోట్ల 89 లక్షల రూపాయలు చెల్లించారు.

● మూడున్నర లక్షల టన్నుల అంచనా..

కొనుగోలు కేంద్రాలకు 3 లక్షల 50 వేల టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. కోతల సమయంలో అకాల వర్షాలు పడడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. తేమ శాతం 17కు మించి ఎక్కువ రావడంతో కొందరు రైతులు వరి కోసిన వెంటనే రైస్ మిల్లర్లకు పచ్చి ధాన్యాన్నే విక్రయించారు. దొడ్డు రకం వడ్లకు క్వింటాలుకు 2100 రూపాయల వరుకు ధర పలకగా, సన్న వడ్లకు 2300 వరకు ధర చెల్లించారు. ప్రస్తుతం వర్షాలు పడే పరిస్థితులు లేకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు మొగ్గుచూపుతున్నారు. ధాన్యాన్ని నాలుగైదు రోజులు ఆరబెట్టి తేమ 17 శాతం వచ్చిన తర్వాత ధాన్యాన్ని కేంద్రాలకు తీసుక వెళుతున్నారు. రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు సన్న రకం వరి పంట సాగును ప్రోత్సహించేందుకు మద్దతు ధరతో పాటు క్వింటాలు ధాన్యానికి 500 రూపాయలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మేరకు జిల్లాలో రైతులు

మిగతా 8వ పేజీలో...

క్రైం కార్నర్

పాదచారుల పైకి దూసుకువెళ్లిన కారు

- ప్రమాదంలో ముగ్గురి మృతి- మరొకరికి గాయాలు


నుజ్జునుజ్జయిన కారు


వెంకట్‌రెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారు రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి పక్క నుంచి నడుచుకుంటూ వెళుతున్న ముగ్గురు బిహార్ కూలీలపైకి వెనుక నుంచి వచ్చిన కారు దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వలస కూలీలు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. కారు నడుపుతున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో గల ఓ రైస్ మిల్లులో బిహార్ కూలీలు ధీరజ్‌కుమార్(23), సికిందర్ మండల(25), లక్ష్మణ్‌కుమార్ కొంత కాలంగా పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పనుల నిమిత్తం బయటకు వచ్చి తిరిగి రైస్ మిల్లుకు రాజీవ్ రహదారి పక్క నుంచి నడస్తూ వెళుతున్నారు. ఆ సమయంలో కరీంనగర్ నుంచి హైదారాబాద్ వెళుతున్న కారు అతివేగంగా నడుచుకుంటూ వెళుతున్న వారిపైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఎ ధీరజ్‌కుమార్(23), సికిందర్ మండల(25) తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందారు. వారితో పాటు న్న లక్ష్మణ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. అతి వేగంగా పాదచారులపైకి దూసుకు వెళ్లిన కారు పక్కనే ఉన్న రెండు పిల్లర్లకు ఢీకొని నిలిచిపోయింది. కారు నడుపుతున్న సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తాడూరు వెంకట్‌రెడ్డి(53)కి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకట్ రెడ్డి కరీంనగర్ వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా కొత్తపల్లి గ్రామ శివారులో చీకటిలో ఈ ప్రమాదం చోటుకుంది. మృతి చెందిన ఇద్దరు బిహార్ కూలీలకు వివాహం కాలేదు. తాడూరు వెంకట్‌రెడ్డికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ముగ్గురు కూతుళ్లకు పెళ్లిళ్లు చేశాడు. ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై తాండ్ర వివేక్, బ్లూకోల్ట్స్ సిబ్బంది సురేష్, మల్లి కార్జున్ క్షతగాత్రులను స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివేక్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

- ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం


ధ్వంసమైన ఆర్టీసీ బస్సు అద్దం


మద్యం మత్తులో యువకుడు

కోరుట్ల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పైడిమడుగు గ్రామంలో మద్యం మత్తులో ఓ యువకుడు శుక్రవారం వీరంగం సృష్టించి ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం చేశాడు. కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పైడిమడుగు మీదుగా రాయికల్‌కు మధ్యాహ్నం సమయంలో బయల్దేరింది. పైడిమడుగు గ్రామ పంచాయతీ సమీపంలోని బస్టాండ్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకున్న డ్రైవర్ బస్సును రాయికల్ వైపు తీసుకెళ్లాడు. మార్గమధ్యలో బస్సు వెళుతున్న సమయంలో ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి బస్సును అడ్డుకున్నాడు. గమనించిన బస్సు డ్రైవర్ బస్సును పక్కకు నిలిపాడు. మద్యం మత్తులో ఉన్న యువకుడు డ్రైవర్ వద్దకు వచ్చి దురుసుగా ప్రవర్తించాడు. బస్సు ఇంతవేగంగా నడుపుతావా అంటూ అక్కడే ఉన్న బండరాయితో బస్సు అద్దం పగలగొట్టాడు. బస్సులో ఉన్న ప్రయాణికులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వారిపైనా దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడాడు. అక్కడకు చేరుకున్న గ్రామస్థులు వారించి యువకుడిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే యువకుడు దాడి చేసినట్లు బస్సు డ్రైవర్, కండక్టర్ కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లిలో శుక్రవారం పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇంటి ముందు ఉన్న చిన్నారి లాస్య బాలుడు విక్కీ, వృద్ధురాలు వజ్రవ్వపై పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. వెంటనే ముగ్గురిని కుటుంబసభ్యులు మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కుక్కల నుంచి కాపాడాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పాలకుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్నూర్ గ్రామానికి చెందిన పొన్నం రాము(36) మూడేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల లంగ్ ఇన్‌ఫెక్షన్ కావంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ సేవసమితి చైర్‌పర్సన్ మనాలిఠాకూర్ 12 వేల రూపాయలతో అంబులెన్స్ మాట్లాడి స్వగ్రామానికి మృతదేహం తెప్పించే ఏర్పాట్లు చేశారు. రాముకి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్ట ణ శివారులోని అర్బన్ హౌజింగ్ కాలనీలో క్రీడా ప్రాంగణం వెనుక గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఆయన మాట్లా డుతూ పక్క సమాచారం మేరకు క్రీడా ప్రాంగణం వె నుకల ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించ గా వారిని తనిఖీ చేశారు. వారి వద్ద కవర్లో ఉన్న నిషే ధిత గుట్కాను పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి అమ్ముతున్న పట్టణానికి చెందిన పోతు అక్షయ్, బండి సాయిరాంలను విచారించగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ నుండి గుర్తు తెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి 500 చొప్పున అమ్మేందుకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్ పరిధిలో ఎవరు గంజాయి సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి..

నటుడిగా, రచయితగా, కవిగా, గాయకుడిగా రాణిస్తున్న దామెర శంకర్

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన దామెర శంకర్ విద్యార్థి దశ నుంచే నటుడిగా, కవిగా, రచయితగా, గాయకుడిగా రాణిస్తున్నారు. అప్పట్లో ఒకవైపు సింగరేణిలో కార్మికుడిగా పనిచేస్తూనే, కోల్‌బెల్ట్ ప్రాంతంలోని పలు అంశాలపై టెలీఫిల్మ్‌లు రూపొందించారు. ఎన్నో పౌరాణిక నాటకాల్లో నటించిన దామెర శంకర్ 1960లోనే గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఉద్యోగ విరమణ పొందిన దామెర శంకర్ ఇప్పటికీ 81 ఏళ్ల వయసులో తనకున్న కళను నలుగురికి పంచుతూ కోల్‌బెల్ట్ ప్రాంతంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.



సినీ నటులు రాజేంద్రప్రసాద్, తనికెళ్ల భరణి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దామెర శంకర్

కళ్యాణ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మార్కండేయ కాలనీ చెందిన దామెర శంకర్ విద్యార్థి దశ నుంచే నటుడిగా, రచయితగా, కవిగా రాణించారు. వృత్తిరీత్యా సింగరేణి కార్మికుడైన శంకర్ నాటక రంగంపై మక్కువతో అనేక నాటికలను ప్రదర్శించడంతో పాటు సినీ పాటలను కూడా రచించారు. 1962లో జనరల్ మజ్దూర్ కార్మికుడిగా సింగరేణిలో చేరిన శంకర్ కోల్‌బెల్ట్‌లో జరిగిన పలు సంఘటనలపై టెలిఫిల్మ్‌లు తీసి ప్రజలను చైతన్యపర్చారు.. సింగరేణి బొగ్గు బావుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్టు నాటకాల రూపంలో ప్రదర్శించారు. నవోదయ మిత్ర కళా మండలిని స్థాపించి 154కు పైగా నాటికలను ప్రదర్శించి 1960లోనే అప్పటి గవర్నర్ భీమ్ సేన్ సబార్ చేతుల మీదుగా ఉత్తమ బహుమతి అందుకు న్నాడు. అలాగే నిర్భయ భారతం, బైరాన్‌పల్లి, సిక్ట్ జర్నీ, శ్రీశైలం, గల్లీ గ్యాంగ్, పది రూపాయల నోటు, పోరు తెలంగాణ సినిమాల్లో శంకర్ ప్రత్యేక పాత్రలను పోషించారు.

అప్పట్లో కోల్‌బెల్ట్ ప్రాంతంలోని యువకులు చెడు మార్గంలో ప్రయాణిస్తుండడంతో వారిలో మార్పు తీసుకు రావడానికి వారి తల్లిదండ్రులు పడుతున్న కష్టాలపై టెలిఫిల్మ్‌లు రూపొందించి వాటికి దర్శకత్వం వహించారు. ఇప్పటికీ 81సంవత్సరాల వయసులోనూ దామెర శంకర్ కోల్‌బెల్ట్‌లో పలు టెలీఫిల్మ్‌లు రూపొందిస్తూ, వివిధ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

యువతను చెడు మార్గంలో వెళ్లకుండా చేయడమే లక్ష్యం..: దామెర శంకర్



కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఒకప్పుడు ఇక్కడ యువకులు 10 తరగతి అయిపోయిన వెంటనే ఆటో డ్రైవర్లుగా మారేవారు. కానీ ఇప్పుడు పరిస్థితు లు మారాయి. చాలా మంది సాఫ్ట్‌వేర్ ఉద్యో గులుగా మారారు. అప్పుడున్న పరిస్థితులపై అనేక టెలిఫిల్మ్‌లను తీసి యువతను సన్మార్గంలో నడిపించడమే లక్ష్యంగా చేసుకుని నాటికలు, నాటకాలు ప్రదర్శన, సమాజంలో చెడును నిర్మూలించి,మంచి మార్పు తేవడమే లక్ష్యంగా టెలిఫిల్మ్‌లను నిర్మిస్తున్నాను.

రేషన్ బియ్యం పట్టివేత

జగిత్యాలరూరల్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లోని శ్రీ ఆంజనేయ రైస్‌మిల్‌లో అక్రమంగా నిల్వ చేసిన 160 క్వింటాళ్ల నూకలు, 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై మధు తెలిపారు. రైస్‌మిల్‌లో పట్టుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు డీటీసీ ఎస్ వరప్ర సాద్, ఆర్ఐలు రాజేంద్రప్రసాద్ స్వాధీనం చేసుకొని సివిల్ సప్లై గోదాంకు తరలించారు. ప్రభాకర్ పై 6 ఏ కేసు నమోదు చేసినట్లు డీటీసీఎస్ వరప్రసాద్ తెలిపారు.

మంథనిలో 16 క్వింటాళ్లు..

మంథని: స్థానిక శ్రీపాద కాలనీలోని బోగె సర్వేశ్ ఇంట్లో సివిల్ సప్లై అధికారులతో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించగా, 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని 40 ప్లాస్టిక్ బ్యాగుల్లో అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించామని ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ బియ్యాన్ని పీడీఎస్ బియ్యం గా అధికారులు గుర్తించారన్నారు. అక్రమ నిల్వపై సర్వేశ్‌ను ప్రశ్నించగా మంథని మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి, మంథనిలోని రేషన్ డీ లర్ గుండా ధనలక్ష్మి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. రేషన్ డీలర్ గుండా ధనలక్ష్మి తన షాప్ నుంచి 7 క్వింటాళ్ళ పీడీఎస్ రైస్‌ను లబ్ధిదారులకు ఇవ్వకుండా తనకు అమ్మినట్లు సర్వేష్ వెల్లడించారన్నారు. సర్వేష్, డీలర్ గుండా ధనలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- సమగ్ర కుటుంబ సర్వేపై అపోహలు వద్దు - ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

- బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 20న రాజన్న సిరిసిల్ల జిల్లాకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణతో కలిసి సీఎం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు పర్యటనను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సీఎం రాక సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా దర్శనం ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోం దన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపర్చేందుకు ధృడసంకల్పంతో కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజలు అపోహ పడవద్దని, దేశానికే దిక్సూచిగా తెలంగాణలో సర్వే నిర్వహించనున్నామని అన్నారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు సహకరించి వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా సర్వేపై అపోహలు అభ్యంతరాలు లేవనెత్తితే అధికారులు స్పందించి సర్వే ఆవశ్యకతపై వివరించాలన్నారు. వారి అపోహలను తొలగించాలన్నారు. సంక్షేమ పథకాల్లో కోత విధించబోమని స్పష్టం చేశారు.

● ఖాతాల్లో డబ్బులు జమఅయ్యేలా..

జిల్లాలో ధాన్యం విక్రయించేందుకు రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ధాన్యం సేకరించి త్వరగా ఆన్‌లైన్ చేసి డబ్బులు ఖాతాల్లో జమయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సన్నధాన్యం విక్రయానికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైస్‌మిల్లర్లు సహకరించకపోతే తాత్కాలిక గోదాముల్లో ధాన్యం నిల్వ చేయాలన్నారు. బ్యాంక్ గ్యారంటీ ఇచ్చి ధాన్యం దించుకోవాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. వారిపై తమకు కోపం లేదని డిఫాల్ట్ రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వాలని అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించే పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కోసం భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వేములవాడ నియోజకవర్గంలో మిడ్ మానేరు నిర్వాసితుల కోసం 10, 600 ఇళ్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన మంత్రి

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 46 సీసీ కమెరాలను శుక్రవారం కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. జిల్లాలో ప్రధాన రహదారులు బోయినపల్లి నుంచి జిలెల్ల వరకు, రుద్రంగి నుంచి వేములవాడ వరకు పైలట్ ప్రాజెక్ట్‌గా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు, త్వరలోనే ఎల్లారెడ్డిపేట నుంచి పెద్దమ్మ స్టేజీ వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, వ్యాపారస్థులు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ వారితో సమానమన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలను పోలీస్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎస్పీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

26న నిర్వహించే దేశ వ్యాప్త నిరసనను విజయంతం చేయాలి - ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కోరుట్ల నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని నరంద్రమోదీ అవలం బిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ఈ నెల 26న జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సినారే కళా భవనంలో రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేసి చర్చించారు. ఈ సమావేశానికి హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ 2020 నవంబరు 26న ఢిల్లీలో మోదీ సర్కార్ ప్రవేశ పెట్టిన మూడు వ్యతిరేక చట్టాలపై ఉద్యమం ప్రారంభం అయిందన్నారు. ఈ ఉద్యమం 384 రోజులు కొన సాగిందని మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చట్టాలను వెనక్కి తీసుకునే విధంగా ఉద్యమం జరిగిందన్నారు. ఈ ఉద్యమం రైతు విజయమన్నారు. 10 సంవత్సరా లుగా మోదీ కార్మిక, రైతుంగ వ్యతిరేక విదానాలు అమలు చేస్తుందని అన్నారు. ప్రదానంగా రైతాంగం పడించిన అన్ని రకాల పంటలకు పార్లమెంట్‌లో కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని, దేశంలోని కీలక ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీ కరణ అపాలని , కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌న్ రద్దు చేయ్యాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా అసంఘటిత స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ. 26,000, కనీస పెన్షన్ రూ. 10,000 ప్రకటించాలని కోరుతూ ఎస్‌కేఎం టీయు సంయుక్తంగా ఈ నెల 26న నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనను కార్మికులు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్ని విజయవంతం చేయ్యాలని కోరారు. సమావేశంలో మొదట అమరవీరులకు నివాళ్లు అర్పించిన నాయకులు కార్మికులు ఎదుర్కోంటున్న సమస్యలపై చేయ్యవలసిన ఉద్యమాలపై చర్చించి వాటిని ఎకగ్రీవ తీర్మాణం జరిపి చేయ్యవలసిని కార్యక్రమాల వివరాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రదాన కార్యదర్శి జనార్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమేశ్వర్, దాసు, భూమన్న అరుణ, సహాయ కార్యధర్శులు దర్శులు గంట, నాగయ్య, శివాజీ, కోశాధికారి సారంగపాణీ, రాష్ట్ర కమిటి సభ్యులు నరేష్, శ్రీనివాస్, బ్రహ్మానందం, లింగ్య, గౌని నాగేశ్వర రావు, శివ ఆశోక్, శంకర్, వేంకట్, తోడెటి నాగేశ్వర్ రావు, రాజేష్, హరితతో పాటు పలువురు పాల్గొన్నారు.

గుడి నిర్మాణంపై వివాదం

- అభ్యంతరం చెప్పిన పక్క స్థలం యజమాని- కాలనీవాసులపై పెట్రోల్ పోసిన వైనం


ఎన్టీపీసీలో రాస్తారోకో చేస్తున్న కృష్ణానగర్ వాసులు

జ్యోతినగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్‌లో గుడి నిర్మాణం వివాదానికి దారితీసింది. గుడి కట్టద్దంటూ పక్క స్థలం యజమాని, మరో వర్గం వారు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గుడిని నిర్మిస్తున్న కాలనీవాసులపై పక్క భూమి యజమాని ఇందారం శ్రీనివాస్ పెట్రోల్ పోశాడు. దీంతో కాలనీవాసులు ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తమపై పెట్రోల్ చల్లిన శ్రీనివాస్‌పై హత్యాయత్నం కేసు పెట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఇరు వర్గాలతో పోలీసులు మాట్లాడుతున్న సమయంలో కృష్ణానగర్‌కు చెందిన పలువురు వ్యక్తులు, కొన్ని సంస్థలకు చెందిన నాయకులు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చారు. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎన్టీపీసీ పోలీసులు రాస్తారోకో చేస్తున్న వారిని బలవంతంగా పంపించివేశారు. గుడి నిర్మిస్తున్న కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. అలాగే మరో వర్గం ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కాలనీవాసులపై కౌంటర్ కేసు నమోదు చేశారు.

● విలువైన భూమి కావడం వల్లే..

గుడి నిర్మిస్తున్న స్థలం పక్కన ఉన్న భూమి విలువైనది కావడమే వివాదానికి కారణమని తెలుస్తున్నది. నిర్మించాలనుకుంటున్న స్థలం పక్కనే ఇందారం శ్రీనివాస్‌కు చెందిన నాలుగు గుంటల స్థలం ఉంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం కోటి రూపాయలకు పైగా ధర పలుకుతుందని తెలుస్తున్నది. గుడి నిర్మిస్తే తన స్థలం రేటు పడిపోతుందనే అనుమానంతో సదరు భూయజమాని అభ్యంతరం చెబుతున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణి ప్రసవం శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి లో గురువారం అర్ధరాత్రి గర్భిణి ప్రసవించింది. శిశువు మృతి చెందడంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు శుక్రవరాం ఆస్పతి ఎదుట ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన కళ్లెం లక్ష్మి ప్రసవం కోసం పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో ఉంటున్న తన తల్లి గారింటికి వచ్చింది. పురిటి నొప్పులు రావడంతో గురువారం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్కానింగ్ చేయించుకొని రావాలని వైద్యులు సూచించారు. దీంతో జమ్మికుంట పట్టణంలో స్కానింగ్ చేయించుకొని ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు అర్ధరాత్రి ఒంటి గంటకు ఆపరేషన్ చేశారు. పుట్టిన శిశువు పరిస్థితి విషమంగా ఉందని, కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. చికిత్స కోసం శిశువును కరీంనగర్‌కు తరలించారు. శిశువు అప్పటికే చనిపోయిందని అక్కడి వైద్యులు తెలిపారు. దీంతో శిశువు మృతికి స్థానిక వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకొని బంధువులతో మాట్లాడారు. బాధితురాలి తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఈ ఘటనపై ఆస్పత్రి సూపరిం టెండెంట్ రాజేందర్‌రెడ్డి వివరణ కోరగా గర్భిణి నెలలు దాటిన తరువాత ఆస్పత్రికి వచ్చిందని చెప్పారు. ఆపరేషన్ చేసి శిశువును బయటికి తీశా మని తెలిపారు. శిశువు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందిగా మారడంతో కరీంనగర్‌కు రిఫర్ చేశామని అన్నారు. ఆస్పత్రికి వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యలో శిశువు మృతి చెందిందని తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

కరీంనగర్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పబ్బేరు సమీపంలో ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లడంతో కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన పలువురికి గాయాలయ్యాయి. దుర్శేడ్ గ్రామం నుంచి 40 మంది, పెద్దపల్లి జిల్లా నుంచి మరో పది మంది కార్తీక మాసం సందర్భంగా ప్రైవేటు టూరిజం బస్సులో అలంపూర్‌లోని ఆలయానికి శుక్రవారం రాత్రి బయలు దేరారు. శనివారం ఉదయం వేకువజామున బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో బస్సు ప్రమాదవశాత్తు పొలాల్లోకి దూసుకెళ్లిందని గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రమాదంలో 15 మందికి గాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దుర్శేడ్ గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ కుటుంబసభ్యుల పరిస్థితిపై ఆరా తీయగా అందరూ క్షేమంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సిబ్బంది కొరత

- బొమ్మకల్‌లో ఆలస్యంగా ప్రారంభమైన సర్వే
- గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో షురూ


బొమ్మకల్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే సిబ్బంది కొరతతో కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో ఇంకా కుటుంబాల నిర్ధారణ సర్వే కూడా పూర్తి కాలేదు. కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామపంచాయతీలు ఉండగా ఈనెల 8వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో స్టిక్కర్‌లు వేసి సర్వేను ప్రారంభించగా బొమ్మకల్ గ్రామంలో ఆలస్యమైంది. శుక్రవారం నుంచి గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో సర్వే ప్రక్రియ కొన సాగుతోంది. మొత్తం 35 మంది ఎన్యూమరేటర్లు అవసరం కాగా పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారిపై అదనపుభారం పడు తోంది. బొమ్మకల్ గ్రామంలో 4,900 కుటుంబాలు ఉన్నట్లు తాజాగా అధికారులు తెలిపారు. అయితే సర్వేలో భాగంగా ఇంటింటికి స్టిక్కర్లు అంటించిన తరువాత కుటుంబాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కరీంనగర్ మండలంలో 16 గ్రామాల్లో మొత్తం 10,400 కుటుంబాలు ఉండగా సర్వే చేపట్టిన ఎన్యూ మరేటర్లు శుక్రవారం నాటికి 5300 కుటుంబాల్లో సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీవో సంజీవరావు తెలిపారు. బొమ్మకల్ గ్రామంలో మాత్రం ఇంకా సర్వే పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. శుక్రవారం మండల పంచాయతీ అధికారి జగదీశ్వర్ గ్రామంలో పర్యటించి సర్వే అంతరాయానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టడంతోనే అవగాహన లేక ఇన్నాళ్లు ఇబ్బందులు ఏర్పడగా గ్రామపంచాయతీ సిబ్బందిని సర్వేలో భాగస్వాములను చేయడంతో ఎట్టకేటలకు ప్రారంభమైంది.

చొప్పదండిలో వస్త్ర దుకాణం దగ్ధం

చొప్పదండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) చొప్పదండి పట్టణంలోని గాలిపెల్లి కనుకయ్య వస్త్ర దుకాణం కాలిపోయింది. కనుకయ్య శుక్రవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి షట్టర్ ముందు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటలు దుకాణంలోకి వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే దుకాణంలోని సామగ్రి కొంత మేర కాలిపోయింది. సుమారు 60 వేల రూపాయల నష్టం జరిగినట్లు కనుకయ్య తెలిపాడు. కాగా వస్త్ర దుకాణానికి వ్యక్తి నిప్పు అంటించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయిన వీడియో స్థానికంగా సమాచార మాధ్యమాల్లో వైరలుగా మారింది.

గడ్డివాము దగ్ధం : రూ.80 వేల ఆస్తి నష్టం

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 15: హుజూరాబాద్ మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం గడ్డి వాము దగ్ధమైంది. గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో వరి కొయ్యకాళ్లను కాల్చేందుకు నిప్పు పెట్టగా, ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు వ్యవసాయ క్షేత్రానికి పక్కనే నిల్వ ఉన్న గడ్డివాములపై పడటంతో అవి దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రూ.80 వేల ఆస్తి నష్టం జరిగింది. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు.



సదిశ వలంటీర్లు

సమాజ సేవలో సదిశ

- పేద విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్య
- యువ ఇంజనీర్ ఆదర్శం
- గూగుల్ సంస్థ ఉద్యోగుల సహాయం
- మూడు రాష్ట్రాలకు విస్తరణ

పేద విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరం కాకూడదని ఓ యువ ఇంజనీర్ సంకల్పించాడు. సదిశ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ప్రతిభ గల విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్యను అందిస్తూ అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నాడు గోవర్దన్‌రెడ్డి. గూగుల్ సంస్థలో పనిచేస్తూ ఉద్యోగుల సహకారంతో మన రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు కూడా తన సేవలను విస్తరించాడు. ఇప్పటి వరకు 232 మంది విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాడు. సంస్థలో 289 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా పని చేస్తున్నారు.

చొప్పదండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం రెవెల్లి గ్రామానికి చెందిన ముచర్ల గోవర్ధన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. తాను చిన్నప్పుడు చదివిన ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు ఫీజు చెల్లించే స్తోమత లేక ఇంటర్ విద్యకు దూరం అయ్యే పరిస్థితులను చూసి చలించి పోయాడు. 2013లో తాను చదువుకున్న పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశాడు. 2016లో సదిశ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నాడు. పలువురు యువకుల సహకారంతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇంటర్ విద్యను, హాస్టల్ వసతిని కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు గోవర్ధన్‌రెడ్డి. సదిశ వేదికగా అనేక మంది యువత సమాజ సేవకు పాటు పడుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం...

ఇద్దరితో మొదలైన ప్రస్థానం

గోవర్ధన్‌రెడ్డి ఇద్దరు వలంటీర్లతో సేవలను ప్రారంభించారు. 2016లో సదిశను స్థాపించిన తరువాత అనేక మంది యువత ఆయనతో చేతులు కలిపారు. సదిశ సంస్థప్రతి సంవత్సరం ఆరు కేంద్రాల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తుంది. రాష్ట్రంలోని కరీంనగర్, వరంగల్, సూర్యాపేట, ఖమ్మంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, మహారాష్ట్రలోని నాందేడ్ కేంద్రంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు ఉచిత విద్య ను అందజేస్తుంది. ప్రస్తుతం 289 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా పని చేస్తున్నారు. పరీక్ష నిర్వహణతో పాటు విద్యార్థుల ఎంపిక బాధ్యతను వలంటీర్లు చూసుకుంటారు. కరీంనగర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు లక్షలాది రూపాయలను చెల్లించి ప్రతి ఏటా విద్యార్థులను చేర్పిస్తున్నారు. ఈనెల 10న మ్యాథ్స్ టాలెంట్ టెస్టును సదిశ నిర్వహించగా మొత్తం 4,169 మంది విద్యార్థులు హాజరయ్యారు. 67మంది విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్యను హాస్టల్ వసతిని కల్పించాలని సంస్థ నిర్ణయించింది.

ప్రతి ఏటా లక్షల రూపాయల ఆర్థిక సహాయం

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బడ్జెట్‌కు అనుగుణంగా ఎంపిక చేసి కార్పొరేట్ కళాశాలల్లో రెండేళ్ల పాటు ఉచితంగా హాస్టల్ వసతితో ఇంటర్ విద్యను అందిస్తారు. ఒక్కో విద్యార్థిపై లక్షకు పైగా ఖర్చు పెడుతుండగా ఆర్థిక వ్యవహారాలన్నీ గోవర్ధన్‌రెడ్డి చూసుకుంటారు. ప్రస్తుతం గూగుల్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న గోవర్ధన్ రెడ్డి తాను సంపాదించిన వేతనంలో ఇరవై శాతం డబ్బులు విద్యార్థుల కోసం ఖర్చు చేస్తున్నారు. తన తోటి ఉద్యోగులు కూడా సహాయం చేస్తుండగా ప్రతి ఏటా లక్షలాది రూపాయలను సేకరించి గోవర్ధన్ విద్యార్థులకు వెచ్చిస్తున్నారు. ఇద్దరితో మొదలైన విద్యార్థుల సంఖ్య గత ఏడాది 57 మందిని కళాశాలలో చేర్పించారు. గూగుల్ ఉద్యోగులు గత ఏడాది 35 వేల డాలర్ల సహాయాన్ని అందించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ముచర్ల గోవర్ధన్‌రెడ్డి, సదిశ సంస్థ వ్యవస్థాపకుడు



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సంస్థ ద్వారా సహాయం చేస్తున్నాం. అనేక ఇబ్బందులు ఎదురవుతున్నా ముందుకు సాగుతున్నాం. వలంటీర్లు స్వచ్ఛంద సేవ చేస్తుండగా సహోద్యోగులు విద్యార్థుల చదువు కోసం సహాయం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెంచుతున్నాం.





విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్న వలంటీర్లు, సదిశ విద్యార్థులు

వాలీబాల్‌లో ఎలగందల్ విద్యార్థిని ప్రతిభ


నక్షత్రను అభినందిస్తున్న హెచ్ఎం ఆనందం

భగత్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తపల్లి మండలం ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.నక్షత్ర ఎంపికయ్యారు. ఈనెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో 14 సంవత్సరాల విభాగంలో ఆమె పాల్గొంటుంది. ఈనెల 6న జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో జరిగిన ఉమ్మడి జిల్లా పోటీల్లో పోటీల్లో అత్యంత ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా నక్షత్రను ప్రధానోపాధ్యాయుడు తుమ్మ ఆనందం, వ్యాయామ ఉపాధ్యాయుడు గిన్నె లక్ష్మణ్, ప్రజా ప్రతినిధులు ఎల్లండి ప్రకాశ్, నిమ్మల అంజయ్య, వంశీ అభినందించారు.

తెలంగాణ పవర్ ఇంజనీర్స్ కార్యవర్గం


అంజయ్య


రఘు


రాజు

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ శాఖలో శుక్రవారం నిర్వహించిన పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్రాంచ్ సెక్రెటరీగా నాయిని అంజ య్య, ట్రెజరర్‌గా జి.రఘు, రాష్ట్ర ట్రాన్స్‌కో వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.రమేష్, కంపెనీ ఆర్గ నైజింగ్ సెక్రెటరీగా కె.రాజు ఎన్నికయ్యారు. కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా స్వామి, పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా ప్రభాకర్, జగిత్యాల జిల్లా కార్యదర్శిగా ప్రసాద్, జాయింట్ సెక్రెటరీగా శశికాంత్, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీగా షరీఫ్, ప్రదీప్, అనిల్,ఆడిట్ కమిటీ మెంబర్గా గట్టయ్య, అదనపు కార్యదర్శిగా సంతోష్, రమాకాంత్, పూర్ణచందర్లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ఐదు వేల మంది ఇంజనీర్లు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఆర్ఎంకు స్పందన

భగత్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రామనికి వచ్చిన కాల్స్‌కు సమాధానాలు ఇచ్చారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 34 మంది ప్రయాణికులు ఫోన్లు చేయగా వారి అర్జీలను పరిశీలించి సంబంధిత డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేస్తామని ఆర్ఎం తెలిపారు.

గంజాయి రవాణా, అమ్మకాలపై పోలీసుల దృష్టి

గోదావరిఖనిలో తనిఖీలు

కోల్‌సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో గంజాయి రవాణా, అమ్మకాలపై వన్‌టౌన్ పోలీసులు దృష్టి పెట్టారు. శుక్రవారం రాత్రి సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. శివారు కాలనీల్లోని కిరాణాషాపులు, పాన్‌షాపులు, అనుమానం ఉన్న వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు జరిపారు. నిర్మానుశ్య ప్రాంతాల్లో గంజాయి సేవిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారనే సమాచారంతో ఖాళీ ప్లాట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో సైతం తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు రమేష్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

- ధర్మారం, (ఆంధ్రజ్యోతి): కిరాణా దుకాణాల్లో గంజాయి చాక్లెట్స్ విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ శీలం లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.
- జూలపల్లి, (ఆంధజ్యోతి) మండల కేంద్రంలోని పలు పాన్‌షాపుల్లో శుక్రవారం జూలపల్లి ఇన్‌చార్జి ఎస్సై నరేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గంజాయి, మాదక ద్రవ్యాల నిల్వలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

మైనర్లకు మద్యం అమ్మిన వైన్‌షాప్ పై ఫిర్యాదు

మంథని, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ఆర్ వైన్సు షాపులో నిబంధనలకు విరుద్ధంగా మైనర్ల మద్యం అమ్మినందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేసినట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేన క్రాంతికుమార్ శుక్రవారం తెలిపారు. మైనర్లకు మద్యం అమ్మన, వారు సిట్టింగ్ రూంలో మద్యం సేవించిన ఫోటోలు, వీడియోలను అందజేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి మైనర్లకు మద్యం అమ్మిన షాపు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ


గోదావరి హారతిలో పాల్గొన్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురిలో కార్తీక పౌర్ణమి ఉత్సవాలు

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పంచ పర్వదినాల్లో ఆఖరి రోజున పౌర్ణమి పురస్కరించుకుని సూర్యోదయం ముందు నుంచే క్షేత్ర నలు మూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. గోదావరిలో స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి వారలను దర్శించుకున్నారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగుసేవలు అందించారు.

కార్తీక మాసం పురస్కరించుకుని దేవాలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు మహిళలు వత్తులు, కార్తీక దీపాలు వెలిగించారు. యాత్రికుల సౌకర్యార్థం ఆర్టీసీ కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల, కోరుట్ల డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ రాంనర్సింహారెడ్డి నేతృత్వంలో ఎస్ఐలు గంగుల మహేష్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, కుమారస్వామి, సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

వైభవంగా పంచ సహస్ర దీపాలంకరణ

ధర్మపురి బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో పంచ సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బ్రహ్మపుష్కరిణి మధ్య గల భోగ మండపంలో గల ప్రత్యేక వేదిక పైన నరసింహస్వామి, లక్ష్మీదేవి చిత్ర పటాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి దీపాలంకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోనేరులోని ఉత్తర ద్వారం నుంచి వేదిక వరకు, నలుమూలల మెట్ల పైన ఐదు వేల దీపాలను భక్తులు వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి పత్యమ్మ, డీసీఎం ఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, జగిత్యాల అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘుచందర్, ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్య పాల్గొన్నారు.

వేములవాడ రాజన్న ఆలయంలో

వేములవాడ కల్చరల్,(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభ సంతరించుకుంది. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్న ఆలయ ముందు భాగంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ప్రదోషకాల పూజ అనంతరం రాత్రి 7.30 గంటలకు జ్వాల తోరణం చేపట్టారు. రాత్రి నిశిపూజ, అనంతరం రాజరాజేశ్వర స్వామికి మహాపూజ జరిపించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో సామూహిక కార్తీక దీపోత్సవం సందర్భంగా శుక్రవారం భక్తులు కార్తీ దీపాలను వెలిగించారు. రాజన్న ఆలయంలోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ప్రారంభించారు.

దుబ్బరాజన్న శైవ క్షేత్రానికి కార్తీక శోభ

సారంగాపూర్,(ఆంధ్రజ్యోతి):మండలంలోని దుబ్బ రాజన్న ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు.

కోటిలింగాలకు పోటెత్తిన భక్తులు

వెల్గటూర్, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కోటిలింగాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. అనంతరం శ్రీ పార్వతీ కోటేశ్వర స్వా మిని దర్శించుకున్నారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ పూజలు జరిపించారు. ఆలయ ఈవో కాంతారెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు. రద్దీకి తగినట్లు ఏర్పాట్లు చేయ లేదని, మహిళలు బట్టలు మార్చుకోవడానికి ఇబ్బంది పడ్డార ని కొందరు భక్తులు వాపోయారు.


వేములవాడలో ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

ఘనంగా వేంకటేశ్వర స్వామికి డోలోత్సవం

కోరుట్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని దేవాలయంలో స్వామి వారి డోలోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో పురోహితులు ప్రత్యేక పూజలను జరిపారు. ప్రత్యేక వేదికపై సా మూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించగా అధిక సంఖ్యలో దంపతులు వ్రతాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలో పాల్గొన్నాడు. ఈ కార్యక్రమంలో యజ్ఞకులు చక్రపాణి మాధవాచార్యులు, అలయ అర్చకులు వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి, ఈ వో విక్రం ఆలయ చైర్మన్ కట్కం రాజేష్, గ్రామస్థులు బర్కం గంగాలక్ష్మి - నర్సయ్య, గంద్ర గోపాల్‌రావు, ద్యాగ రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, పోతుగంటి రాజేశం గౌడ్, పిట్టల రమేష్, నూతుపల్లి మధు పాల్గొన్నారు.


కోటిలింగాలలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


కోరుట్లలో సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న దంపతులు


దుబ్బ రాజన్న ఆలయంలో భక్తుల పూజలు




ధర్మపురిలో భక్తుల పుణ్యస్నానాలు, వేములవాడలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



న్యూస్ బాక్స్

నూతన నియామకం

పాలకుర్తి ,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాల గ్రామానికి చెందిన ఎండి ఖాజా అజిమొద్దీన్‌ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

కళ్యాణ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తలసేమియా చిన్నారుల కోసం ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌బీనగర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ ఫౌండేషన్ సభ్యుడు ఐత శివకుమార్ తెలిపారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యం లో ప్రతిఏటా 10వేల నుంచి 12వేల యూని ట్లు అందించడం జరుగుతుందని, ఈ రక్త దాన శిబిరంలో యువకులు అధిక సంఖ్య లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సభ్యులు రామకృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాల హంగామా..

జ్యోతినగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ఉత్పత్తి ప్రారంభించి 40 ఏళ్ల పూర్తయిన సందర్భంగా, ఎన్టీపీసీ సంస్థ 50 ఏళ్ల సర్ణోత్సవాల సందర్భంగా శనివారం ప్రముఖ బాలివుడ్ ప్లే బ్యాక్ సింగర్ల మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నారు. మహాలక్ష్మి అయ్యర్, వైభవ్ గుప్తా వైభవ్ గుప్తా, ఐశ్వర్య పండిట్ తదితర గాయకుల ఆధ్వర్యంలో సంగీత విభావరి జరుగనుంది. అలాగే ఈ సందర్భంగా 150 డ్రోన్లతో ఆకాశంలో లైటింగ్ షో నిర్వహిస్తున్నారు. ఈ సాంస్కృతిక ఉత్సావాలకు ఎన్టీపీసీ భారీ ఏర్పాట్లు చేస్తోంది.

ఉచిత వైద్య పరీక్షలు

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ కార్మికులకు, సిబ్బందికి, ఉద్యోగులకు శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు ప్రారంభించారు. 120 మందికి పలు రకాల పరీక్షలు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొనేందుకు గాను సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి అద్వైత్ ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తెలిపారు. ఈ నెల 16, 17 తేదీలలో మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అద్వైత్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ సత్యం తదతరులు సన్మానించారు.

న్యాయవాదులకు వ్యాస రచన పోటీలు

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులకు ఈనెల 20న వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు టీఎస్‌సీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ వరలక్ష్మి తెలిపారు. ఈమేరకు శుక్రవారం సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులతో కలసి పోటీలకు సంబందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రస్తుతకాలంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి రాజ్యాంగం అవశ్యకత అనే అంశంపై నిర్వహించే వ్యాస రచన పోటీలలో న్యాయవాదులు తమ అభిప్రాయాలను వ్యక్తపరచాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు పడాల శ్రీరాములు, న్యాయవాదులు నేరెళ్ల శంకరయ్య, ఆవుల శివకృష్ణ, బాను, అంబాల రాజు రమేష్ పాల్గొన్నారు.

గ్రూప్-4లో జిల్లావాసుల సత్తా



ఆవుల అంజి, ఆవుల రాజు, వీరముష్టి రమేష్, ఉరగొండ అనూష, పిల్లలమర్రి వినోద్ కుమార్, పిల్లలమర్రి అరవింద్, లైశెట్టి అఖిల్, నిఖిల్‌కుమార్

పెద్దపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైనా గొల్లపల్లికి చెందిన ఆవుల మల్లయ్య-మల్లీశ్వరి దంపతుల కుమారులు ఆవుల రాజు, అతని సోదరుడు ఆవుల అంజికి ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 4లో ఒకే ఇంట్లో ఇద్దరు ఉద్యోగాలు సాధించారు. ఆవుల రాజు మంథని జేఎన్‌టీయూలో బీటెక్, అంజి బాసర ట్రిబుల్ ఐటీ పూర్తి చేశాడు. గురువారం విడుదల చేసిన ఫలితాల్లో ఇద్దరూ జూనియర్‌అసిస్టెంట్ ఉద్యోగాలను సాధించారు. ఒకే ఇంటి నుంచి ఇద్దరు సోదరులు ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, హర్షం వ్యక్తం చేశారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడెంకు చెందిన రైతు వీరముష్టి కొమురయ్య-కిష్టమ్మల కుమారుడు రమేష్ గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఎంబీఏ చదివిన రమేష్ ఫారెస్ అధికారిగా మహదేవ్‌పూర్‌లో విధులు నిర్వహిస్తుండగా, తాజాగా గ్రూప్4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. అలాగే గుంపులకు చెందిన ఉరగొండ సదయ్య-సునితల కూతురు అనూష డిగ్రీపూర్తి చేసి గ్రూప్4 లో ఉద్యోగం పొందింది. వీరు ఉద్యోగాలు పొందడంపై గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 4 ఫలితాల్లో దొంగతుర్తికి చెందిన నలుగురు యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన పిల్లలమర్రి తిరుపతి-శకావతి దంపతుల ఇద్దరు కుమారులు వినోద్ కుమార్, అరవింద్‌లు ప్రభుత్వ కొలువులు సాధించారు. పెద్ద కుమారుడు వినోద్ కుమార్‌కు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా, చిన్న కుమారుడు అరవింద్ కాలేజ్ ఎడ్యూకేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా కొలువు వచ్చింది. అలువాల తిరుపతి-స్వరూపల కుమారుడు కమల్ సివిల్ డిపార్టమెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించగా, లైశెట్టి బిక్షపతి-అనితలకు మారుడైన అఖిల్ కూడా జూనియర్ అసిస్టెంట్ గా కొలువు సాధించాడు. కాగా, ఉద్యోగాలు సాధించిన యువకులు వ్యవసాయ అధారిత కుటుంబాల నుంచి రావడం విశేషం.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): కాల నీకి చెందిన సోమారపు నిఖిల్‌కుమార్ గ్రూప్- 4లో ఉద్యోగం సాధించాడు. జిల్లా కలెక్టరేట్‌లోని ట్రెజరీ విభాగంలో జూనియర్ అకౌంటెంట్‌గా నిఖి ల్‌కుమార్‌కు పోస్టింగ్ ఇస్తూప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిఖిల్ తండ్రి వెంకటయ్య ఓసీపీ-3 కార్మికుడు. సీహెచ్‌పీలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు.



బంగారు రమేష్, బందారి ప్రశాంత్, ముస్కు ఆదిత్య

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలో గ్రూపు-4 ఉద్యోగాలకు ముగ్గురు ఎంపికయ్యారు. కాల్వ శ్రీరాంపూర్ నుంచి బంగారు రమేష్, బంగారు కిరణ్, గంగారంనకు చెందిన బండారి ప్రశాంత్,ముస్కు ఆదిత్య, వెన్నంపల్లి నుంచి కదురు నాగరాజు ఎంపికైనారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్-4 ఉద్యోగాలకు ప్రభుత్వ విడుదల చేసిన జాబితాలో వీరు ఎంపిక కావడం పట్ల ఉద్యోగాలకు ఎంపికైన కుటుంబ సభ్యులతో పాటు వారి మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

కన్నుల పండువగా స్వామివారి కల్యాణం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు - దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



మాంగళ్యధారణ నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారిని దర్శించుకున్న పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం అర్చకులు దేదీప్యామానంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణ తంతును కన్నులపండువగా నిర్వహిస్తూ కల్యాణ సమయం వరకు మాంగల్యదారణ నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులంతా దీపారాధన నిర్వహించి లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 12 నుంచి 21 వరకు స్వామి వారి బ్రహోత్సవాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా కల్యాణ మహోత్సవం అనంతరం నిర్వహించే కార్యాలకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సందర్శించి స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన మాజీ ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. బ్రహోత్సవాల దృష్ట్యా జాతర ప్రాంగణంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా బసంత్‌నగర్ పోలీస్ ఆధ్వర్యంలో భారీబందోబస్త్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో శంకరయ్య, చైర్మన్ సదయ్య, ఆలయ అర్చకులు కొండపాక లక్ష్మీ నర్సింహచార్యులు, కొండపాక శ్రీకాంతచార్యులు, శ్రీధరాచార్యులు, మాజీ సర్పంచ్‌లు కిషన్, మాజీ ఎంపీటీసీ పందిళ్ల లక్ష్మణ్, నాయకులు బొక్కల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.500 బోనస్ వచ్చేసింది..

(5వ పేజీ తరువాయి)

80 శాతం వరకు వరి పంటనే సాగు చేశారు. కేంద్రాల్లో విక్రయించిన ధాన్యం సొమ్ముతో పాటే బోనస్ సొమ్మును చెల్లించకపోవడంతో రైతుల్లో అనుమానాలు తలెత్తాయి. అసలు ప్రభుత్వం బోనస్ ఇస్తుందా, లేదా అని చర్చించుకోవడం కనిపించింది. ప్రతిపక్ష పార్టీలు సైతం రైతులకు ఇస్తామన్న బోనస్ సొమ్ము ఇవ్వడం లేదని విమర్శలు గుప్పించాయి. అయితే నాలుగు రోజుల నుంచి బోనస్ సొమ్మును పౌరసరఫరాల శాఖ అధికారులు సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారుల నుంచి రైతులు ఎన్ని క్వింటాళ్ల సన్న ధాన్యం విక్రయించారు, వారి ఖాతా నంబర్లను తీసుకుని గత నాలుగు రోజుల నుంచి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● రైతుల ఖాతాల్లోనే బోనస్ జమ చేస్తున్నాం..

- రాజేందర్, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి

జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు తీసుకుని వారి బ్యాంకు ఖాతాల్లో క్వింటాలుకు 500 రూపాయలు జమ చేస్తున్నాం. బోనస్ విషయమై రైతులు ఆందోళన చెందవద్దు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో పాటు సన్న రకం ధాన్యానికి బోనస్ పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి. తొందరపడి రైతులు ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించవద్దు. ధాన్యంలో తేమ 17 శాతం మించకుండా చూసుకోవాలని, నాణ్యతగల ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకరావాలి.

ఉచిత కంటి వైద్య శిబిరం

కోల్‌సిటీటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన 38 మందిని రేకుర్తి కంటి ఆసుపత్రికి మధ్యాహ్నం పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి అధ్యక్షులు నార్ల ప్రసాద్, కార్యదర్శి మామిడిపల్లి శ్రీధర్, కోశాధికారి కోదాటి ప్రవీణ్, జయప్రకాష్, గుంత వినోద్, ఐబాల్ కలెక్షన్ చైర్‌పర్సన్ సందినేని గోపాలరావు, బొల్లి రవికుమార్, కొలిపాక సతీష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నటరాజ్, సతీష్, విజేందర్, మల్లిఖార్జున్, శ్రీను, రమణారావు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత

కోల్‌సిటీటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన ఏక్ శ్రీనివాస్‌కు శుక్రవారం వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ రూ.20వేలు ఆర్థిక సహాయం అందించింది. ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాళ్ల హరీష్‌రెడ్డి తండ్రి వ్యాళ్ళ రాంరెడ్డి చేతుల మీదుగా రూ.20వేల నగదును ఏక్‌శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలకు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ అండగా నిలుస్తూ సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఆర్ రామగుండం నియోజకవర్గ సభ్యులు, వివిధ డివిజన్ల ఫౌండేషన్ ఇంచార్జీ, పాలకుర్తి మండల వీహెచ్‌ఆర్ సభ్యులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్‌లు ప్రారంభం

రామగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీలోని పన్నూరు సెంటర్, సాయిబాబా ఆలయంలోని ప్రధాన కూడలీలలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌లను శుక్రవారం మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపన్న, మంథని కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తొట చంద్రయ్య, ఆలయ కమిటీ చైర్మన్ వనం రాంచందర్‌రావు, మాజీ ఎంపీటీసీ చిందం మహేష్, ప్రచార కమిటీ చైర్మన్ ముస్కాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నీరజ తులసి రాంగౌడ్, నాయకులు ఆరెల్లి కొంరయ్యగౌడ్, బండారి సదానందం, కాటం సత్యం దాసరిశివ, శంకర్, అవినాష్, గాజుల శ్రీనివాస్, గంట వెంకటరమణరెడ్డి, రజిత, జికే యాదవ్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మంథని, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైర్‌పర్సన్‌పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, మండలంలోని పుట్టపాక, బిట్టుపల్లి, నగరంపల్లి, సూరయ్యపల్లి, కాకర్లపల్లి, మహబూబ్‌బాద్, గద్దలపల్లి, గోపాల్‌పూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బెల్లకొండ ప్రకాష్‌రెడ్డి, నేతలు పేరవేన లింగయ్యయాదవ్, కుడుదుల వెంకన్న, ఆరెల్లి కిరణ్‌గౌడ్, డైరెక్టర్లు దేవళ్ల విజయ్‌కుమార్, ప్రభాకర్, లక్ష్మి, మాధవి, ఓదెలు, పోచం, నేతలు సురేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

మాలలను రెచ్చగొడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్



విలేకరుల మావేశంలో మాట్లాడుతున్న పాపయ్య

పెద్దపల్లిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ మాలలను రెచ్చగొడుతున్నారని మాదిగ మిత్ర మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటగిరి పాపయ్యఅంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య ఆరోపించారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియాసమావేశంలో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు రాగానే సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేపడతామని సభలో మాట్లాడారని, కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ కాంగ్రెస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌ను ఏమనాలని ప్రశ్నించారు. మాలల పక్షాన పోరాడాలని అనుకుంటే ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి పోరాడాలన్నారు. సంకనపల్లి లక్ష్మయ్య మాజీ ఎంపీపీ కాంపల్లి ప్రభాకర్, తాళ్లపల్లి అంజయ్య, రాజయ్య, సందీప్, పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం త్వరగా తరలించాలి : కలెక్టర్



నర్సాపూర్‌లో సమగ్ర కుటుంబ సర్వే ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎలిగేడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు లేకుండా చూడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ మండలంలో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. నర్సాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇంటింటి సర్వే, ఎలిగేడు మార్కెట్ యార్డు, ఇంటింటి సర్వే, దూళికట్ట గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ రైస్ మిల్లుల వద్ద కోతలు లేకుండ చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం నాణ్యతను నిరంతరం పరిశీలించాలని, ధాన్యం తేమశాతం రాగానే వెంటనే కొనుగోలు చేసి, సెంటర్‌కు కేటాయించిన రైస్ మిల్లులకు త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని, కొనుగోలు ధాన్యం వివరాల ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సన్న రకం ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలవద్ద అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ పక్కాగా చేయాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ బషీరొద్దీన్, అదనపు డీఆర్డీవో రవికుమార్, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఏవో ఉమాపతి, ఏపీఎం సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయ భాస్కర్‌రెడ్డి, సీతఈవోలు విక్రమ్, రవీందర్‌రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మారుపేర్ల సమస్యకు త్వరలో పరిష్కారం

గోదావరిఖని, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారు పేర్ల బాధితులు తమ పేర్లు నమోదు చేసుకోవడానికి రావాలని, మారుపేర్ల సమస్య పరిష్కరించడానికి ఈనెల 28న సింగరేణిలో జరిగే స్ట్రక్చర్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు మారుపేర్ల బాధితుల సంఘం నాయకులు లక్క శ్రావణ్ చెప్పారు. శుక్రవారం గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా మారు పేర్లతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటి వరకు 72మంది పేర్లు మాత్రమే నమోదు అయ్యాయని, ఈనెల 20న గోదావరిఖని చౌరస్తాలో మారు పేర్ల బాధితుల ఐక్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి హాజరై బాధితులు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వెంకట్, సందీప్, సత్యం, శ్రీనివాస్, హరీష్, రాజశేఖర్, కార్తీక్ పాల్గొన్నారు.

ఇంటర్నల్ ఆడిట్ కమిటీ సమీక్షా సమావేశం



ఆడిట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

రామగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో ఇంటర్నల్ ఆడిట్ కమిటీ సమావేశాన్ని జీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఇంచార్జ్ జీఎం రఘుపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏరియాలలోని వివిధ గనులు, విభాగాలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆడిట్ అధికారి మోహన్‌రావు వివిద అంశాలపై సూచనలు చేశారు. ఆర్జీ-3, ఏపీఏ అధికారులు శ్రీనివాసులు, అజయ్‌కుమార్, గుర్రం శ్రీహరి, రామకృష్ణ, మతిన్‌హుస్సేన్, విక్రమ్, సాయికృష్ణ, జ్యోతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రక్చర్ మీటింగ్‌లో కార్మికుల సమస్యలను చర్చిస్తాం : ఏఐటీయూసీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో ఈనెల 28న జరిగే సింగరేణి స్ట్రక్చర్ సమావేశంలో కార్మిక సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణిలో కొన్ని సంవత్సరాలుగా కార్మికుల సమస్యలపై చర్చించి అగ్రిమెంట్లు చేసుకునే పద్ధతిలో జరుగాల్సిన స్ట్రక్చర్ చైర్మన్, డైరెక్టర్ లెవల్ సమావేశాలు జరుగకపోవడం వల్ల కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సింగరేణిలో వివిధ కారణాల వల్ల డిస్మిస్ అయిన వారికి తిరిగి ఉద్యోగాలు ఇప్పించడం, మారు పేర్లు ఉన్న కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, మైనింగ్, ట్రేడ్‌మెన్స్, ఈపీ ఆపరేటర్లు మెడికల్ అన్‌ఫిట్ అయితే సుటబుల్ జాబ్ ఇవ్వాలని, అలవెన్సులు ఇవ్వాలని, ఇన్సెంటివ్ ఇవ్వాలని తదితర సమస్యలపై యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కొన్ని సంఘాలు ఏఐటీయూసీని బదనాం చేయడానికి ఉత్సాహం చూపుతున్నాయని, మెంబర్‌షిప్ రికవరీ విషయంలో కార్మికుల్లో అలజడి సృష్టిస్తున్నారని, దీనిపై యజమాన్యం తమ అభిప్రాయాన్ని తెలపాలని నోటీసు జారీ చేసినప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోషం, కవిత, మద్దెల దినేష్, ఎంఏ గౌస్, దాసరి శ్రీనివాస్, గొడిశెల నరేష్, బుర్ర భాస్కర్, మొగిలి, మల్లేష్, తొడుపునూరి రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని యూనియన్ సెంట్రల్ వైస్‌ప్రెసిడెంట్లు నరసింహారావు, ధర్మపురిలు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్జీ-2 యూనియన్ ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ చేయలేని పనులను ఐఎన్‌టీయూసీ చేస్తుండడంతో ఉనికి కోల్పోతామని సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందనే ప్రచారాన్ని చేయడం మానుకోవాలని సూచించారు. కేవలం సంస్థ అభివృద్ధి, కార్మిక సమస్యల పరిష్కరం కోసం మాత్రమే ప్రభుత్వ సహకారాన్ని కోరుతున్న విషయాన్ని గుర్తించాలని వారు కోరారు. 33 శాతం లాభాల వాటా ఇప్పించడం, డిపెండెంట్ల వయస్సు 40కి పెంచడం వంటివి అమలు చేశామని తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు సీపీఐ ఎమ్మెల్యేతో కలిసి సీఎం దృష్టికి సమస్యలు తీసుకెళ్తే తాము తప్పుగా భావించలేదని, అసమర్థతను కప్పి పుచ్చుకోడానికి ఐఎన్‌టీయూసీపై నిందలు వేయడాన్ని ఖండిస్తున్నట్టు నరసింహారావు, ధర్మపురిలు పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో సంస్థ అభివృద్ధి కుంటుపడిందని, మితిమీరిన రాజకీయ జోక్యంతో సింగరేణి వ్యవహారాలపై తీవ్ర ప్రభావం పడినట్టు తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికలను ప్రభావితం చేసే స్థాయిలో గత ప్రభుత్వం సింగరేణిలో జోక్యం చేసుకుంటే ఏఐటీయసీకి బాధ్యత ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. సింగరేణిలో కార్మిక సంఘాల ఉనికిని దెబ్బతీసేలా, ప్రైవేట్ సంస్థలకు బొగ్గు గనుల కేటాయింపులు జరిగినపుడు ఏఐటీయూసీ చేసిన పోరాటాలేంటో కార్మికులకు వివరించాలని నరసింహారావు, ధర్మపురిలు ప్రశ్నించారు. ఈవిలేకరుల సమావేశంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి, నాయకులు శంక ర్‌నాయక్, ఆకుల రాజయ్య, కర్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు

- జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ముత్యంరావు

పెద్దపల్లిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) సీపీఎం జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్లను జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు అనంతరం ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ సీపీఎం జిల్లా 3వ మహాసభలు ఈనెల 23, 24 రెండు రోజులు పారిశ్రామిక ప్రాంతమైన ఎన్టీపీసీలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో జరగనున్నాయని తలిపారు. ఈ సందర్భంగా మొదటి రోజు వేలాది మందితో ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుంది. 2వ రోజు అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న జిల్లా నలు మూలల నుంచి ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర, జిల్లా నాయకత్వం పాల్గొంటుందని తెలిపారు. మహాసభలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించబడుతుంది. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న సీపీఎం జిల్లా మహాసభల జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

● కాల్వశ్రీరాంపూర్ నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మహాసభల పోస్టర్‌ను మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా కార్యదర్శి ఎర్రవేల్లి ముత్యంరావు మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడుతూ ఈనెల 23,24 తేదీలలో జిల్లా మహాసభలను ఎన్టీపీసీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తున్నాయని ఈ సందర్భంగా ఈనెల 26న దేశవ్యాప్త నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు రైతులు, కార్మికులు, యువతి, యువకులు బడుగు అట్టడుగు వర్గాలు అత్యధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మంద రాజేందర్, దొడ్ల రాజబాబు, కొమురయ్య, చల్ల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సుద్దాల విద్యార్థినికి రాష్ట్ర స్థాయి బహుమతి

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పోటీలలో మండంలోని సుద్దాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు అనుదీప్తి, ఆనన్య, అవంతిక, శ్రీవర్షిణి, ఏ అనన్య, మహితలు రాష్ట్ర స్థాయి బహుమతులు గెలుచుకున్నారు. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాధికారి రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బహుమతులు పొందిన వారిని ఎంఈవో రాజయ్య, ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.